క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): పేదలకు అందించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అడిషనల్ డీఎంహెచ్‌వో ఉషారాణి కోరారు. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌లోని విజయవాడ – గుంటూరు ప్యాకర్స్ అండ్ మూవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం పేద ప్రజలకు అందని ద్రాక్షగా మిగిలిపోయిందని, ఇటువంటి తరుణంలో స్వచ్ఛందంగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులు అభినందనీయులన్నారు. శరీర భాగాల్లో అతి ముఖ్యమైన నేత్రాల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పౌష్టికరమైన ఆహారం తీసుకోవడంతో పాటు కళ్లకు సంబంధించి ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం కిరణ్, 43వ డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, అసోసియేషన్ ప్రెసిడెంట్ పీవీకే ప్రసాద్, సెక్రటరీ టి.కోటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ బి.శ్యామ్‌బాబు, ట్రెజరర్ వీ సతీష్, సభ్యులు కరుణాకర్, సత్యనారాయణ, అడుసుమిల్లి లక్ష్మీ చౌదరి, స్థానిక పెద్దలు పువ్వాడ శ్రీనివాసరావు, తూనుగుంట్ల అరవింద్, వీవీ సాంబశివరావు పాల్గొన్నారు.

మేలు జాతి పశువుల ఉత్పత్తే లక్ష్యం



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మేలు జాతి పశువుల ఉత్పత్తే లక్ష్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ పని చేస్తోందని, దీని కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్న ఏ1 వర్కర్లను అభినందిస్తూ బోనస్ పంపిణీ చేస్తున్నామని చైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. పాల ప్రాజెక్టు ఆవరణలోని క్షీరదర్శిని సమావేశ మందిరంలో బుధవారం ఏ1 స్టేషనరీ వర్కర్లకు బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ.. ఏ1 స్టేషనరీ వర్కర్లు 40 వేల సేమన్ డోస్‌లు చేసినందుకు వారిని అభినందిస్తున్నామన్నారు.
పాడి రైతులకు మేలు జాతి సెమన్‌ను నామమాత్రం రుసుంతో అందజేస్తున్నామని చెప్పారు. దీనివల్ల కృష్ణా మిల్క్ యూనియన్‌పై రూ.2 కోట్ల అదనపు భారం పడుతున్నా రైతుల సంక్షేమం కోసం ఈ భారాన్ని భరిస్తున్నామన్నారు. మేలు జాతి సెమన్‌ను అందించేందుకు 60 మంది ఏ1 వర్కర్లను నియమించడమే కాకుండా 20 మంది సుశిక్షితులైన పశువైద్యుల పర్యవేక్షణలో వైద్యం అందిస్తున్నామని తెలిపారు. కృష్ణా మిల్క్ యూనియన్ పశు సంక్షేమానికి ప్రతి ఏటా రూ.5 కోట్లు వెచ్చిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, పీఅండ్‌జీ ఎంజీ అనిల్‌కుమార్, ఏ1 స్టేషనరీ వర్కర్లు, సమితి సిబ్బంది పాల్గొన్నారు.

రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలోని గురుకుల సాంఘిక సంక్షేమ ప్రభుత్వ కళాశాలలో బుధవారం మహాభారత రచనకు ప్రేరకుడు, తెలుగుజాతికి ఆరాధ్యుడు రాజరాజ నరేంద్ర మహారాజు పట్టాభిషేక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వల్లూరు నీరజ అధ్యక్షతన అతిథి ఉపన్యాస కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ విశ్వవిద్యాలయ భాషాశాస్త్రశాఖ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ జి. ఉమామహేశ్వరరావు, ఆంధ్ర లయోల కళాశాల చరిత్ర విభాగాధిపతి డాక్టర్ మొవ్వ శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. అనంతరం ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, కళాశాల సిబ్బంది అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

లోకేష్.. నోరు అదుపులో పెట్టుకో

- దమ్ముంటే.. విజయవాడ అభివృద్ధిపై చర్చకు సవాల్
- వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి
- నగరంలో భారీ బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ రుహుల్లా, ఎమ్మెల్యే వెలంపల్లి, పార్టీ శ్రేణులు



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, నేతలు



పోలీస్ కంట్రోల్ రూమ్ వద్ద పార్టీ నాయకుల బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): 'లోకేష్ .. కారుకూతలు కుయ్యకు. దమ్ముంటే విజయవాడ అభివృద్ధిపై చర్చకు రా... అంతేకానీ నగరం బయటకు పారిపోయి నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు.. నోరు అదుపులో పెట్టుకో..' అంటూ వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు నారా లోకేష్‌కు సవాల్ విసిరారు. విజయవాడ గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా... వై నాట్ 175 సీట్లు నినాదంతో పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాతబస్తీ రథం సెంటర్ నుంచి బైక్ ర్యాలీని వెలంపల్లి ప్రారంభించారు.

టీడీపీకి కాలం చెల్లింది..

ర్యాలీని ప్రారంభిస్తూ వెలంపల్లి మీడియాతో మాట్లాడారు. దొడ్డిదారిన మంత్రిగా పని చేసిన నారా లోకేష్‌గానీ, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబునాయుడు విజయవాడ నగరానికి ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. యువగళం పేరుతో నగరంలోకి వచ్చిన లోకేష్ గోతులంటూ ఇష్టమొచ్చినట్లు విమర్శలు చేసి పారిపోయారన్నారు. ఎక్కడ గోతులు ఉన్నాయో చెప్పాలన్నారు. టీడీపీ యువగళానికి పేమెంట్ గాళ్లను తరలించి హడావుడి చేశారని ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనలో జరిగిన అభివృద్ధిపై చెప్పాలని, పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని సవాల్ విసిరితే చెప్పకుండా పారిపోయాడన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వారు ఏమి చేశారో ప్రజలకు చెప్పే దమ్ము, ధైర్యం లేదన్నారు. గన్నవరం సభలో టీడీపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఊగిపోతూ మంత్రి జోగి రమేష్ మీద ఇతర నాయకులపైనా తీవ్రమైన పదాలతో దాడి చేశారన్నారు. టీడీపీకి కాలం చెల్లిందన్నారు. అందువలనే ఇష్టమొచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలోని మూడు నియోజకవర్గాలు జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తున్నాయన్నారు. వేలాది మంది పార్టీ కార్యకర్తలు, ప్రజలందరూ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్నారన్నారు. అందువల్లనే రానున్న ఎన్నికల్లో 175కు 175 సీట్లు వస్తాయని నమ్మకంగా ముందుకు సాగుతున్నామన్నారు. నగరంలో మూడు నియోజకవర్గాలు గెలిచి జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వటానికి పార్టీ శ్రేణులు, ప్రజలు సిద్ధంగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రుహుల్లా, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు బండి నాగేంద్ర పుణ్యశీల, తోలేటి శ్రీకాంత్, పార్టీ వాణిజ్య విభాగ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి బుజ్జి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వించిపేటపేట(విజయవాడపశ్చిమ): వై నాట్ 175 నినాదంతో బుధవారం వించిపేట, నైజాంగేటు సెంటర్ నుంచి జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గౌస్‌మొహిద్దీన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గాంధీబొమ్మ సెంటర్, పంజా సెంటర్, తారాపేట మీదుగా రథం సెంటర్ చేరుకుని ఎమ్మెల్యే వెలంపల్లితో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. నాయకులు వడ్డాది అనిత, సురేష్, సయ్యద్ ఇమ్రాన్, గుర్రం సీతారామయ్య, రాజారావు, షేక్ షోయబ్, తామర సాయికృష్ణ పాల్గొన్నారు.

నగర వ్యాప్తంగా ర్యాలీ

నగరంలోని మూడు నియోజకవర్గాల్లో బుధవారం సాయంత్రం బైక్ ర్యాలీ జరిగింది. సెంట్రల్ ఎమ్మెల్యే విష్ణు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి, తూర్పు ఇన్‌చార్జి అవినాష్ ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయాల నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీల్లో కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు. రథం సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ లో బ్రిడ్జి, పోలీస్ కంట్రోల్ రూమ్, బందరు రోడ్డు మీదుగా బెంజిసర్కిల్‌కు చేరుకుంది.

భారతీయుల ప్రతిభ అమోఘం

చంద్రయాన్–3 విజయవంతంపై సంబరాలు



ఎన్‌సీసీ విద్యార్థుల కేరింతలు



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



విక్రమ్ ల్యాండింగ్ తిలకిస్తున్న విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచంలో భారతీయ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అమోఘమని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. చంద్రయాన్–3 విజయవంతంగా ల్యాండ్ అయిన సందర్భంగా ఆ కళాశాల ప్రాంగణంలో బుధవారం సాయంత్రం ఆ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా విద్యార్థులు తిలకించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ భారతీయ పరిశోధనా సంస్థ ఇస్రో అద్భుతమైన విజయాలను సొంతం చేసుకుంటుందన్నారు. అందులో భాగంగా తాజాగా చంద్రయాన్–3 విజయవంగా తన లక్ష్యాన్ని పూర్తి చేసుకుంటుందని వివరించారు. విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆవిష్కరణలను తెలుసుకొని వాటిపై పట్టు సాధించాలన్నారు. చంద్రయాన్–3 విజయం భారతీయులందరి విజయమని వివరించారు. ఇటువంటి అంశాలపై మరింత లోతైన అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, అధ్యాపకులు సీహెచ్ నాగభూషణం, ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ హైస్కూల్‌లో..

అంతరిక్ష ప్రపంచంలో ఏ దేశం సాధించలేని ఘనత మన భారతదేశం సాధించిందని కొత్తపేట హిందూ హైస్కూల్ హెచ్‌ఎం కంచర్ల శ్రీనివాసరావు అన్నారు. చంద్రయాన్ – 3 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ హిందూ హైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ప్రదర్శన కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. జాబిల్లిపై అడుగు పెట్టాలని కోరుతూ హిందూ హైస్కూల్ మహిళా ఉపాధ్యాయులు భారత్ మాతాకీ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రయాన్ ప్రయోగాన్ని ప్రత్యేక స్క్రీన్ ద్వారా విద్యార్థులు వీక్షించారు. చంద్రయాన్ విజయవంతంపై ఎన్‌సీసీ విద్యార్థులు భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. సక్సెస్ సింబల్ చూపిస్తూ ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. రానున్న రోజుల్లో భారతదేశం తిరుగులేని దేశంగా మారబోతుందన్న ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని ఎన్‌సీసీ అధికారి బి.బ్రహ్మేశ్వరరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాఠశాల అసిస్టెంట్ ప్రధానోపాధ్యాయులు సోమ భరత్‌కుమార్, ఉపాధ్యాయుల ప్రతినిధి చిట్టా రాజశేఖర్, సీనియర్ ఉపాధ్యాయులు జే ఆనందకుమార్, డాక్టర్ ఎస్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కాపు సమాఖ్య కార్యాలయంలో చంద్రయాన్–3 విజయవంతంపై సంబరాలు నిర్వహించారు. సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి మిఠాయిలు పంచిపెట్టారు. చంద్రయాన్ విజయవంతం కావటం 140 కోట్ల భారతీయులకు ఆనందాన్ని కలిగించిందన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు జయహో ఇస్రో అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో ఇళ్ల రెగ్యులరైజేషన్



ఇళ్ల రెగ్యులరైజేషన్‌పై చర్చిస్తున్న జేసీ సంపత్ కుమార్, ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొండ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తోందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆమె 46వ డివిజన్‌లోని కొండ ప్రాంతాల్లో పర్యటించారు.
చిట్టినగర్ పరిధిలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల వెనుక భాగం, కేఎల్ రావు పార్కు, కుమ్మరిపాలెం సెంటర్ తదితర కొండ ప్రాంతాల్లో జరుగుతున్న ఇళ్ల క్రమబద్ధీకరణను ఆమె పరిశీలించారు. స్థానికులకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపర్చాలని, ఖాళీ స్థలాల్లో చెత్త, వ్యర్థాలు వేయవద్దని స్థానికులకు సూచించారు. ఈ పర్యటనలో వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి రాయన నరేంద్ర కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పరిశీలన



బీఎల్వోలకు సూచనలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ సమ్మరీ రివిజన్ –2024 కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ నియోజకవర్గంలోని అజిత్‌సింగ్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన డోర్ టు డోర్ సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు వారి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు – చేర్పులు లేదా చనిపోయిన ఓటర్ల తొలగింపు వంటి వాటికి ఫారం–6, 6ఎ, 7, 8 ఫారంలను అందించి దరఖాస్తు చేయించారు. అనంతరం వాటిని మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ముఖ్యంగా ఒకే డోర్ నెంబర్‌లో ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని, జీరో నెంబర్ ఉన్న వాటిని ప్రత్యేకంగా పరిశీలించారు. అలాగే 100 ఏళ్లుపైబడిన ఓటర్ల వయసు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. కాగా సర్వే చేసిన అనంతరం సెంట్రల్ నియోజకవర్గం చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో సమీక్షించారు.

ఘనంగా టంగుటూరి, గిడుగు జయంతి

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



టంగుటూరి, గిడుగు చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి ఆదర్శప్రాయులని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు, గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా వారోత్సవాలను బుధవారం మేయర్ ప్రారంభించారు. విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ.. టంగుటూరి ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. టంగుటూరి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన గొప్ప వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని మేయర్ కొనియాడారు. వివిధ రంగాల్లో ఆయన సేవలను గుర్తించి విజయవాడలోని ప్రకాశం బ్యారేజ్‌కు ప్రకాశం పంతులు పేరు పెట్టారని తెలిపారు.

తెలుగు భాషా వారోత్సవాలు ప్రారంభం..

తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు, తెలుగు భాషోద్యమానికి మూల పురుషుడు గిడుగు వెంకట రామ్మూర్తి అని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిడుగు రామ్మూర్తి జయంతిని ఈ నెల 29వ జరుగుతున్న సందర్భంగా వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. తెలుగు వారందరూ ఈ భాషోద్యమ వారోత్సవాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, అదనపు కమిషనర్(జనరల్) యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల, డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) డి.వెంకటలక్ష్మి, నగరపాలక సంస్థ సెక్రటరీ కె.వసంత లక్ష్మి, మేనేజర్ బి.శ్రీనివాస్‌రావు, ఇతర అధికారులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ క్యాంప్‌లు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో ప్రజలకు ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ సర్వీసును గ్రామ/వార్డ్ సచివాలయాల్లో ఈ నెల 24, 25 తేదీల్లో స్పెషల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. నగరంలోని 286 సచివాలయాల్లో ఈ క్యాంప్‌లను ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అదనపు కమిషనర్(జనరల్), యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఈ ఆధార్ అప్‌డేట్ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలపాడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాలలో బుధవారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన 100 మంది విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల సిబ్బంది ట్రస్ట్ సభ్యులు అవినాష్, ఆదిత్య, మహేష్ పాల్గొన్నారు.

తిరుమల నిత్యాన్నదానానికి 10 టన్నుల కూరగాయల వితరణ



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తిరుమలలో జరిగే నిత్యాన్నదానానికి కూరగాయలను పంపించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని దాత మండవ నాగేశ్వరరావు చెప్పారు. తిరుమల పంపే కూరగాయల లారీకి పటమట ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త కంకణాల రమేష్, మండవ వెంకటరత్నంలు లారీకి జెండా ఊపి తిరుమలకు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2006వ సంవత్సరంలో విజయవాడ నుంచి తిరుమలకు కూరగాయలను పంపించడాన్ని సామాజికవేత్త మండవ కుటుంబరావు ప్రారంభించారన్నారు. ఈ ఏడాది మే 29న మండవ కుటుంబరావు ఆకస్మికంగా మరణించారని, ఆయన లేకపోయినా టీటీడీకి కూరగాయల పంపిణీని ఆగకూడదనే ఉద్దేశంతో కూరగాయల లారీని పంపుతున్నామని చెప్పారు. ప్రతి నెలా విజయవాడ నుంచే కూరగాయల లారీని దాతల సహకారంతో పంపుతామని చెప్పారు. మండవ కుటుంబసభ్యులు సస్య, అరవపల్లి ఆదిత్య, శ్రీహరిరావు, ధనేకుల వెంకట సత్యనారాయణ, మండవ శ్రీనివాస్, నాగు పాల్గొన్నారు.

జీజీహెచ్ సీఎస్ ఆర్‌ఎంఓగా డాక్టర్ పద్మావతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ప్రభుత్వాస్పత్రి సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ వై.పద్మావతి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్ర సచివాలయంలోని డిస్పెన్సరీలో పనిచేస్తున్న డాక్టర్ పద్మావతి పదోన్నతిపై సీఎస్ ఆర్‌ఎంఓగా నియమితులయ్యారు. కాగా జీజీహెచ్ సీఎస్ ఆర్‌ఎంఓ పోస్టు 14 నెలలుగా ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ హనుమంతరావును గతేడాది మే నెలలో బదిలీ చేశారు. అప్పటి నుంచి డెప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ యు.శోభ ఇన్‌చార్జి సివిల్‌సర్జన్ ఆర్‌ఎంఓగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం డెప్యూటీ సివిల్‌సర్జన్స్‌కు సివిల్ సర్జన్స్‌గా ప్రభుత్వం పదోన్నతులు కల్పించడంతో డాక్టర్ వై.పద్మావతిని సీఎస్ ఆర్‌ఎంఓగా నియమించారు.